క్లుప్తంగా

'రథయాత్ర' జయప్రదం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రకు సంబంధించిన సభను పట్టణంలోని పటేల్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పెద్దింటి క్రాంతి తెలిపారు. శనివారం స్థానికంగా ఉద్యోగులతో కలిసి రథయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మణిపూర్ ఘటనపై మహిళల నిరసన


నినాదాలు చేస్తున్న మహిళలు

కాగజ్‌నగర్‌టౌన్: మణిపూర్‌లో కుకీ తెగకు చెందిన ఇద్దరు ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనకు నిరసనగా శనివారం ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు స్థానికంగా ఆందోళన చేపట్టారు. ఐద్వా జిల్లా కార్యదర్శి దుర్గం అనిత మాట్లాడుతూ మణిపూర్ ఘటనకు బాధ్యులను తక్షణమే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలు రానున్న ఎన్నికల్లో అధికార బీజేపీకి తగిన బుద్ధి చెబుతారన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత


సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై భూమేశ్

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన షేక్ ముసావీర్ అనే యువకుడు పోగొట్టుకున్న స్మార్ట్‌ఫోన్‌ను పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి శనివారం బాధితుడికి అందజేశారు. రెబ్బెన ఎస్సై భూమేశ్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు ఫిర్యాదు చేస్తే గుర్తించి బాధితులకు అందజేస్తామన్నారు. అవకాశాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పద్మశాలీ సంఘం అధ్యక్షుడికి సన్మానం

ఆసిఫాబాద్‌అర్బన్: ఇటీవల నిర్వహించిన పద్మశాలీ సేవా సంఘం జిల్లా ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన చెన్నూరి అశోక్‌ను శనివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకన్న ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు జంజిరాల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బండి శ్రీనివాస్, సభ్యులు దాసరి రాజు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్	
కుమురంభీం	: బేబి
కాగజ్‌నగర్	
వెంకటరమణ	: మహావీరుడు

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.80
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	80
కాకరకాయ	80
బెండకాయ	120
అలసంద	60
దొండకాయ	80
పచ్చిమిర్చి	100
పాలకూర	60
సోరకాయ	60
చిక్కుడు కాయ	100
గోబి(పూల్)	100
క్యాబేజి	60

-ఆసిఫాబాద్‌అర్బన్


సిర్పూర్(టి): హుడ్కిలి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్‌గంగ


కెరమెరిలో కూలిన పెంకుటిల్లు


దహెగాం: పీపీరావు ప్రాజెక్టులోకి చేరిన వరద నీరు

ఉప్పొంగిన వాగులు


దహెగాం: 10 కిలోల చేపను చూపిస్తున్న మత్స్యకారుడు


కౌటాల: తుమ్మిడిహెట్టి వద్ద పరవళ్లు తొక్కుతున్న ప్రాణహిత

సిర్పూర్(టి): మండలంతో పాటు సమీపంలోని ఎగువ ప్రాంతంలో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలం మీదుగా ప్రవహిస్తున్న పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. పెన్‌గంగ పరీవాహక గ్రామాలైన వెంకట్రావ్‌పేట్, టోంకిని, పారిగాం, లోనవెల్లి, హుడ్కిలి, జక్కాపూర్, మాకిడి గ్రామాల్లోని పంట పొలాలు వరదనీటిలో మునిగిపోయాయి. శనివారం ఉదయం నుంచి మహారాష్ట్రలోని నదుల నీటి ప్రవాహం పెరగడంతో పెన్‌గంగ నది ఉప్పొంగి ప్రవహిస్తుంది. మండలంలో కురిసిన భారీ వర్షాలకు సిర్పూర్(టి) వాగు, టోంకిని మద్దెల వాగు, పారిగాం వాగు, భూపాలపట్నం జీడివాగు, చింతకుంట వాగు, చీలపల్లి వాగు, ఇటిక్యాల పహాడ్ వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.

వరద ఉధృతిని పరిశీలించిన అధికారులు

మండలంలో ప్రవహిస్తున్న పెన్‌గంగ నదితో పాటు పలు వాగులను శనివారం తహసీల్దార్ రియాజ్ అలీ, ఎస్సై దీకొండ రమేశ్‌లు పరిశీలించారు. ప్రజలతో మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా నదితో పాటు వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా వెంటనే గ్రామ వీఆర్ఏకు, తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం అందించాలన్నారు. వీరి వెంట ఆర్ఐ ముబిన్ అహ్మద్, సిబ్బంది ఉన్నారు.

పీపీరావు ప్రాజెక్టుకు జలకళ

దహెగాం: వర్షాకాలం ఆరంభం నుంచి నెల రోజులుగా భారీ వర్షాలు కురువకపోవడంతో ప్రాజెక్టులు, చెరువులు నీరు లేక వెలవెలబోయాయి. కాగా గత మూడు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో పీపీరావు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టులు, చెరువుల్లోకి వరద నీరు చేరడంతో మత్స్యకారులు చేపలను వేటాడుతున్నారు. ఈ క్రమంలో పీపీరావు ప్రాజెక్టులో రాజయ్య అనే మత్స్యకారుడికి 10 కిలోల చేప చిక్కింది.

పెద్దవాగుకు పోటెత్తిన వరద..

శనివారం వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ ఎగువ ప్రాంతంలో వర్షాలు కురువడం, కుమురం భీం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో పెద్దవాగు ఉగ్రరూపం దాల్చి వరద పోటెత్తింది. మండలంలోని బీబ్రా, రాళ్లగూడ వద్ద పెద్దవాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది.

ఉప్పొంగి ప్రవహిస్తున్న పెద్దవాగు

కాగజ్‌నగర్‌రూరల్: కుమురంభీం ప్రాజెక్టు గేట్లను ఎత్తడంతో శనివారం పెద్దవాగు ఉప్పొంగి ప్రవహించింది. దీంతో పెద్దవాగు పరీవాహక ప్రాంతాలైన అంకుసాపూర్, వంజీరి, భట్‌పల్లి, అందవెల్లి గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. తహసీల్దార్ మునావర్ షరీఫ్ అందవెల్లి వద్ద పెద్దవాగును పరిశీలించారు. ప్రజలు ఎవరూ పెద్దవాగు దాటవద్దని సూచించారు.

ఉప్పొంగిన ప్రాణహిత..

కౌటాల: జిల్లాతో పాటు మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని తుమ్మిడిహెట్టి వద్ద గల ప్రాణహిత నది వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. వరదనీరు పుష్కర ఘాట్‌ను తాకుతూ ప్రవహిస్తోంది. వరదనీరు పెరగడంతో గంగపుత్రులు చేపల వేట నిలిపివేశారు. తాటిపల్లి, గుండాయిపేట వద్ద పెన్‌గంగ నది ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీంతో మహారాష్ట్రకు నాటు పడవల రాకపోకలు నిలిచిపోయాయి. సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సాయన్న సూచించారు.

కూలిన చర్చి ప్రహరీ

కౌటాల: మండలంలోని శివలింగపూర్ గ్రామంలో గల ఇమ్మాన్యుయేల్ చర్చి చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడలోని కొంత భాగం వరదనీటికి శనివారం కూలిపోయిందని చర్చి పాస్టర్ సువార్త రాజన్న తెలిపారు. దాదాపు రూ. 70వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

భారీ వర్షానికి కూలిన ఇల్లు

కెరమెరి: మండలంలో గడిచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలోని సుర్పం మనోహర్‌కు చెందిన ఇల్లు శనివారం కూలిపోయింది. గత కొన్ని రోజుల నుంచి మనోహర్‌తో పాటు ఆయన భార్య అరుణ, తల్లి సేవంతబాయిలు పెంకుటింట్లో నివాసం ఉంటున్నారు. అయితే శనివారం ఏకధాటిగా కురిసిన వర్షానికి ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

అడ్డంగా రిబ్బన్‌లు, చీరలు..

మండలంలో గడిచిన మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు, నదులు పొంగిపొర్లుతున్నాయి. ఆయా వాగుల్లో నిండుగా నీరు ప్రవహిస్తుండడంతో శనివారం ఖట్టిగూడ (దేవాపూర్)వాగు వద్దకు ప్రజలు వెళ్లకుండా దారికి అడ్డంగా చీరె కట్టగా, సాంగ్వి గ్రామ సమీపంలో ఉన్న కల్వర్టుపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో దారికి అడ్డంగా ప్రమాద సూచికగా రిబ్బన్ కట్టారు.


కాగజ్‌నగర్‌రూరల్: ఉప్పొంగి ప్రవహిస్తున్న పెద్దవాగు


సిర్పూర్(టి): పెన్‌గంగ ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్


కెరమెరి: సాంగ్వి సమీపంలో ఉన్న కల్వర్టుకు అడ్డంగా కట్టిన రిబ్బన్

డబ్బులు పొదుపుగా వాడుకోవాలి


చెక్కు అందజేస్తున్న జీఎం దేవేందర్

రెబ్బెన: సింగరేణిలో పని చేస్తున్న ఉద్యోగులకు రిటైర్మెంట్ సందర్భంగా సంస్థ అందిస్తున్న డబ్బులను బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకుని పొదుపుగా వాడుకోవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. ఏరియాలో మెడికల్ ఇన్‌వ్యాలిడేట్ అయిన తూముల శ్రీనివాస్ తన కుమారుడికి కారుణ్య నియామకం వద్దనుకోవడంతో లంసంగా సంస్థ అందించిన చెక్కును శనివారం జీఎం అందజేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్ కుమారుడు మంచి వేతనంతో కూడిన ఉద్యోగం చేస్తుండటంతో సింగరేణి ఉద్యోగాన్ని సంస్థకే అప్పగిస్తూ లంసంగా రూ.25లక్షల కోసం కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. దీంతో యాజమాన్యం పన్నులు మినహాయించి శ్రీనివాస్‌కు రూ. 20,30,000 మంజూరు చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, డీవైపీఎం తిరుపతి పాల్గొన్నారు.

పత్తి పంటల పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కడంబా, ఆరెగూడ, మోసం గ్రామాల్లోని పత్తి చేలను శనివారం మండల వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ శైలేష్ పాల్గొన్నారు.

పీరీల బంగ్లాకు షెడ్ నిర్మించండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

ఆసిఫాబాద్‌అర్బన్: జైనూరు మండలం పాట్నాపూర్ గ్రామంలోని కరంజిగూడలో హస్సన్ హుస్సేన్ దేవస్థానానికి (పీరీల బంగ్లా) శాశ్వత షెడ్డు నిర్మాణం చేపట్టాలని శనివారం భక్తులు ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు జిల్లా కేంద్రంలోని తన నివాసంలో వినతిపత్రం అందజేశారు. షెడ్డు నిర్మాణంతో పాటు భక్తులకు కావాల్సిన నీరు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో భక్తులు సాజిద్, రెహమాన్, అస్లాం ఖాన్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల నిరసనలు


ఆసిఫాబాద్‌అర్బన్: సామూహిక భోజనం చేస్తున్న కార్మికులు


కెరమెరి: చెవిలో పూలతో నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రామపంచాయతీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ తలపెట్టిన సమ్మె శనివారం 17వ రోజు కొనసాగింది. సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట కార్మికులు వంటావార్పు చేపట్టారు. కార్యక్రమంలో కార్మికులు శంకర్, రాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చెవిలో పూలతో నిరసన

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న జీపీ కార్మికుల సమ్మె శనివారం 17వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా చెవిలో పూలతో కార్మికులు నిరసన తెలిపారు. గడ్డల వెంకటేశ్, రాందాస్, నరేశ్, రాజు, పోషం, పరమేశ్వర్, శ్రీనివాస్, నగేశ్, జైవంత్‌రావు, రాజు, మల్లేశ్, దత్తు, ప్రభు, స్వామి, శ్రీకాంత్, రవి పాల్గొన్నారు.

ఒంటికాలిపై నిరసన

కాగజ్‌నగర్‌రూరల్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శనివారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఒంటికాలిపై కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికులకు నిరుద్యోగ జేఏసీ జిల్లా కన్వీనర్ పొన్న రమేశ్ మద్దతు ప్రకటించారు. నాయకులు రమేశ్, మల్లేశ్, భాగ్య, సంధ్య, చైన్‌రావు, ధర్మయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల భిక్షాటన

కౌటాల: పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం 17వ రోజు కార్మికులు కౌటాలలో డప్పు చప్పుళ్లతో భిక్షాటన చేశారు. ముందుగా తలోడి చౌరస్తాలోని బాబు జగ్జీవన్‌రావు, అంబేద్కర్, జ్యోతి బాపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక దుకాణాల్లో కార్మికులు భిక్షాటన చేశారు. పంచాయతీ సిబ్బందిని ప్రభుత్వం పర్మినెంట్ చేయాలన్నారు. సమ్మెలో కార్మికులు మోరేశ్వర్, నాగేశ్, కరుణాకర్, ప్రకాష్, నానయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావు దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ముస్లింలు

ఆసిఫాబాద్‌అర్బన్: ముస్లిం మైనార్టీలను కించపర్చేలా వ్యాఖ్యలు చేసిన మంత్రి హరీశ్‌రావు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఆయన దిష్టిబొమ్మను శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్ వద్ద ముస్లింలు దహనం చేశారు. మంత్రి చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ అసద్, ఆసిఫ్, జీమిర్, గంగారాం, జిలాని, జావిద్ పాల్గొన్నారు.

రోడ్డు వేయాలని నిరసన


బురదరోడ్డుపై వరినాట్లు వేస్తున్న మహిళలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని బసంతినగర్ విలేజ్ నెం.3 గ్రామ పాఠశాల సమీపంలోని రోడ్డు బురదమయంగా మారింది. దీంతో శనివారం గ్రామ మహిళలు బురద రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన తెలిపారు. రోడ్డు వేయాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి సీసీరోడ్డు వేయాలని కోరారు. కార్యక్రమంలో యువకులు అమిత్‌మల్లిక్ తదితరులు ఉన్నారు.

నిలిచిన ఆర్టీసీ బస్సు సేవలు

దహెగాం: మండలానికి ఆర్టీసీ సేవలు నిలిచిపోయాయి. ఐదు రోజుల క్రితం కుంచవెల్లి సమీపంలో వంతెన అప్రోచ్ రోడ్డు వద్ద మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బురదలో దిగబడి పోయింది. దీంతో మండలానికి బస్సు సేవలు నిలిపివేశారు.

ప్రైవేట్ వాహనాల్లో అధిక చార్జీలు..

మండలం నుంచి బస్సులు లేక ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నామని మండల వాసులు వాపోతున్నారు. మంచిర్యాల డిపోకు చెందిన బస్సు బెల్లంపల్లి మీదుగా దహెగాం మండలంలోని కల్వాడ, కుంచవెల్లి, చంద్రపల్లి, చినరాస్పెల్లి, ఒడ్డుగూడ, లగ్గాం మీదుగా మండల కేంద్రానికి వచ్చేది. ప్రతీరోజు నాలుగు ట్రిప్పులు వచ్చే బస్సు నిలిపివేయడంతో ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. అందవెల్లి పెద్దవాగుపై వంతెన కూలిపోగా కాగజ్‌నగర్ రూట్ బంద్ కావడంతో ప్రయాణికులు అవసరాల నిమిత్తం మంచిర్యాల, బెల్లంపల్లికి రాకపోకలు సాగిస్తున్నారు. దహెగాం నుంచి బెల్లంపల్లి 45 కిలోమీటర్లు ఉండగా ప్రైవేటు వాహనదారులు ఒక్కొక్కరికి సుమారు రూ.120 నుంచి రూ.150 వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దహెగాంకు ఆర్టీసీ బస్సులు నడిపించి రవాణా కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

ఓటుహక్కుపై అవగాహన

నార్నూర్: ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించేలా అవగాహన కల్పిస్తున్నట్లు తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సతీశ్ అన్నారు. శనివారం మండలంలోని నాగల్‌కొండలో ఈవీఎం ద్వారా ఎలా ఓటు వేయాలని వివరించారు. 18 ఏళ్లు నిండిన వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ సునీత, నారాయణ పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్ ఇంటిని ముట్టడిస్తాం

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే రోడ్డును బాగు చేయకుంటే జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ఇంటిని ముట్టడిస్తామని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు రాథోడ్ భిక్షపతి హెచ్చరించారు. శనివారం నాయకులతో కలిసి రోడ్డుపై నిలబడి నిరసన తెలిపారు. రోగులతో పాటు గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నా.. అధికార పార్టీ నాయకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కనీసం అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. నాయకులు శ్రీను, అక్షయ్, ధర్మరక్షక్, రణ్వీర్, మహేశ్, కపిల్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

బెల్లంపల్లి: సైబర్ నేరాలపై విద్యార్థులు సరైన అవగాహన పెంచుకుని, మోసాలకు గురి కాకుండా ఉండాలని తాళ్లగురిజాల ఎస్సై నరేష్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, బాలుర గురుకుల కళాశాల విద్యార్థులకు శనివారం పోలీసుల ఆధ్వర్యంలో సైబర్‌నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ఆండాళ్లు అమ్మవారి తిరునక్షత్రం

మందమర్రిరూరల్: పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆండాళ్లు అమ్మవారి తిరు నక్షత్రం కార్యక్రమం ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు అనంతాచార్యులు, నరసింహాచార్యులు పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భక్తి పాటలతో అలరించారు. ఆండాళ్లు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

అనారోగ్యంతో సర్పంచ్ మృతి


శంకర్ (ఫైల్)

రెబ్బెన: మండలంలోని తక్కళ్లపల్లి గ్రామ సర్పంచ్ మడె శంకర్ (49) శనివారం ఉదయం స్వగృహంలో అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో సర్పంచ్‌గా శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు చెన్న సోమశేఖర్, ఎంపీటీసీ సంఘం శ్రీనివాస్, పులికుంట సర్పంచ్ బుర్స పోషమల్లు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అంత్యక్రియలో పాల్గొన్న ఎమ్మెల్యే

సర్పంచ్ శంకర్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి తనయుడు కోవ సాయినాథ్‌లు సర్పంచ్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కోవ సాయినాథ్ సర్పంచ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీటీసీలు, సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

బ్రిడ్జి మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం


వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో కాలినడకన వెళ్తున్న జనం

ఆసిఫాబాద్‌రూరల్: బ్రిడ్జి మరమ్మతులకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని తుంపెల్లి వాగు వరద ఉధృతికి బ్రిడ్జి చివర తాత్కాలికంగా వేసిన మట్టి కొట్టుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వాగు ప్రవాహం తగ్గిన తర్వాత పరిస్థితిని పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బృహత్ పల్లె ప్రకృతివనానికి స్థలం గుర్తింపు


స్థలం పరిశీలిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కడంబా గ్రామంలో బృహత్ పల్లె ప్రకృతివనం నిర్మించేందుకు శనివారం స్థలం గుర్తించారు. అటవీశాఖకు చెందిన ఐదెకరాల స్థలాన్ని అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గౌరీశంకర్, ఫారెస్టు సెక్షన్ అధికారి తిరుమల్‌రావు, ఏపీవో సోహెబ్, టెక్నికల్ అసిస్టెంట్ దేవేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ రవికుమార్, సర్పంచ్ బూరం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.